క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి


జైప్రతాప్‌కుమార్

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సీహెచ్ వందన కళాశాల మేడ పైనుంచి పడిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందారు జైప్రతాప్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దురదృష్టకర సంఘటనతో విద్యార్థిని రెండు కాళ్లు, వెన్నుముఖకు తీవ్రంగా గాయాలై శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేజీబీవీ నిర్వాహకులు, సిబ్బందిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. గాయపడిన విద్యార్థినికి కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా మెరుగైన వైద్యసేవలందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడిన బాలిక కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని కేజీబీవీల్లో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు వేయాలన్నారు. మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.

జిల్లేడు ద్రావణంతో చీడపీడల నివారణ


జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న టీమ్ సభ్యులు

సరుబుజ్జిలి: పంటల్లో జిల్లేడు ద్రావణం వేయడం వలన చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం టీమ్ ఎంటీ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీ విధానంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తక్కువ పెట్టుబడితో లభించే ద్రావణాలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఎంటీ సురేష్, ఐసీఆర్పీలు తిరుపతిరావు, సుమ, రైతులు పాల్గొన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 85 మంది రోగులకు శ్రీకాకుళం రిమ్స్ నుంచి వచ్చిన పలువురు వైద్య నిపుణులు, స్థానిక సీహెచ్‌సీ వైద్యులు వైద్య పరీక్షలు చేపట్టినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ లీలాకుమార్ తెలిపారు. పలు రకాల క్యాన్సర్లకు సంబంధించిన లక్షణాలను వివరించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈఓ బుజ్జిబాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మండలంలోని పారాపురం వద్ద నిర్మించిన మినీ రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు ధర్మారావు, సాధుబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గులివిందలపేటలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుమతి ఇచ్చారని గుర్తుచేశారు. ఈ మేరకు వంశధార ఇంజినీరింగ్ అధికారులు వచ్చి సర్వే చేశారన్నారు. పారాపురం, గూనభద్ర, ఓండ్రుజోల, మెట్టూరుగూడ, ఇరపాడు, దుగ్గుపురం, పాడలితోపాటు 14 గ్రామాల్లో 2,500 ఎకరాల మిగులు భూములు ఉన్నట్లు గుర్తించారన్నారు. ఎత్తిపోతల పథకానికి అప్పట్లోనే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలు వంశధార ఎస్ఈ కార్యాలయంలోనే ఉన్నాయన్నారు. అప్పట్లో ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు రిజర్వాయర్ పరిశీలనకు వచ్చినప్పుడు ఎత్తిపోతల పథకం కోసం చెప్పడంతో సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. వంశధార ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత రైతులు భూములు ఇచ్చారని, వారికి చెందిన మిగులు భూములకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని కోరారు. వంశధార ప్రాజెక్టు నుంచి సుమారు 120 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇచ్ఛాపురం భూములకు సాగునీరు అందిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం.. రిజర్వాయర్‌కు అనుకొని ఉన్న మిగులు భూములకు సాగునీరు అందివ్వకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి అసెంబ్లీలో ఎత్తిపోతల పథకం నిర్మాణంపై చర్చించాలన్నారు. వైస్సార్‌సీపీ నాయకులు తిర్లంగి కృష్ణమోహన్, మురపాక శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణించేది ఎలా?


సిరుసువాడ వద్ద తేలిన మెటల్

- మధ్యలోనే నిలిచిన సిరుసువాడ రోడ్డు పనులు
- సుమారు 200 రోజులు కావస్తున్నా పూర్తికాని వైనం
- వర్షాలు కురిస్తే నరకాన్ని తలపిస్తున్న రహదారి
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

కొత్తూరు: పల్లె పండగ పేరుతో రహదారులను అద్దాల్లా తయారుచేస్తామని కూటమి నాయకులు చేసిన ప్రకటనలకు.. క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు అసలు పొంతనే లేకుండాపోయింది. సంక్రాంతి నాటికి రహదారులను నిర్మిస్తామని ఇచ్చిన హామీకి మరో సంక్రాంతి వచ్చేస్తున్నా.. రహదారులు మాత్రం బాగుపడిన దాఖలాలు లేవు. మండలంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన పీహెచ్ రోడ్డు నుంచి వయా లోతుగెడ్డ, సిరుసువాడ, కుంటిభద్ర వరకు అభివృద్ధి చేపట్టేందుకు జాతీయ ఉపాధి హామీ నుంచి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది మార్చి 23వ తేదీన పాతపట్నం ఎమ్మెల్యే రహదారి పనులను ప్రారంభించారు. వంద రోజుల్లో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. నేటికి సుమారు రెండు వందల రోజులు కావస్తున్నా రోడ్డు పనులు పూర్తికాలేదు. పనులు అర్ధాంతంగా నిలిచిపోవడంతో సిరువాడ, లోతుగెడ్డ, కుంటిభద్ర గ్రామాలకు చెందిన ప్రజలు నరకయాతన పడుతున్నారు. మెటల్ తేలడంతో కాలినడకకు కూడా అవకాశం లేదు. సైకిళ్లపై స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కురిసిస్తే రోడ్డు కాలువను తలపించేలా తయారవుతోంది. ప్రతి నిత్యం వందల వాహనాలు తిరుగుతున్న ఈ రోడ్డు పనుల్లో జాప్యం చేయడంతో అధికారులు, పాలకుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని కోరుతున్నారు.

రాళ్లు తేలాయి..



వర్షం పడితే ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకంగా ఉంది. వర్షాలకు రోడ్డు కాలువలా తయారైంది. రాళ్లు తేలడంతో సైకిళ్లు, వాహనాలు పాడవుతున్నాయి. రోడ్డు పనులు పూర్తిచేయకపోవడంతో పాఠశాలకు సకాలంలో చేరలేకపోతున్నాం.

– కోటిలింగాల సుధీర్, 9వ తరగతి, సిరుసువాడ, కొత్తూరు మండలం


కుంటిభద్ర వద్ద రోడ్డు దుస్థితి


సిరుసువాడ నుంచి కుంటిభద్ర పాఠశాలకు సైకిళ్లపై వస్తున్న విద్యార్థులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్‌కు పనులు ప్రారంభించాలని ఇప్పటికే ఆదేశించడం జరిగింది. వర్షాల కారణంగా పనులు పూర్తిచేయడంలో కొంతమేర జాప్యం జరిగింది.

– దుర్గాప్రసాద్, జేఈఈ, కొత్తూరు మండలం

పనులు పూర్తిచేయాలి



రోడ్డు పనులు ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో నరకయాతన పడుతున్నాం. రాళ్ల తేలడం వల్ల నరకం చూస్తున్నాం. అధికారులు స్పందించి రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలి.

– రామచంద్ర పాత్రో, సిరుసువాడ, కొత్తూరు మండలం

రాజకీయ విద్వేషంతోనే దుష్ప్రచారం



- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం కుంభకోణం అంటూ ఆధారాల్లేని కేసులో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి భారతి రెడ్డిని ఇరికించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతుండడంతో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా ఈనాడు వంటి సంస్థ విష కథనాలు, ప్రచారాలను చేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు అన్ని విషయాలు తెలుసుని.. జగన్‌మోహన్‌రెడ్డిని కేసుల రూపంలో ఇరికించాలని చూస్తే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీని నిర్వీర్యం చేసే కుట్ర రాష్ట్రంలో జరుగుతోందని ఆరోపించారు. వై.ఎస్.జగన్‌పై ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోందన్నారు. ఈ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి.. జగన్‌మోహన్‌రెడ్డి పతనాన్ని కోరుకోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా చంద్రబాబు పాలనపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. లేకుంటే చరిత్రహీనులుగా మిగులుతారన్నారు.

పార్టీ పటిష్టతే లక్ష్యంగా పనిచేయాలి


అరవింద్ నాయుడును సత్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని నూతనంగా పార్టీ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరికీ మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన కనపల అరవింద్ నాయుడును సోషల్ మీడియా వింగ్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కొంగరాపు నాగరాజును పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నియమించారు. వీరు ఆదివారం వేర్వేరుగా మబగాంలో ధర్మాన కృష్ణదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణదాస్ వారిరిని సత్కరించారు.

ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, కనపల శేఖరరావు, లుకలాపు రవి, సురంగి నర్సింగరావు, దోమ మన్మథరావు, బుద్దల రాజశేఖర్, పాగోటి గోవింద్, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్


వెంకటసత్యంను అభినందిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పార్టీ అధిష్టానం నుంచి ఇటవల పదవులు పొందిన వారికి ఆదివారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీ (బూర్జ మండలం వైకుంఠపురం) బొడ్డేపల్లి వెంకటసత్యం, స్టేట్ దివ్యాంగుల విభాగం సెక్రటరీ (సరుబుజ్జిలి మండలం) బాణ్న రామును సన్మానించారు. ఈ సందర్భంగా వీరు పార్టీ అధిష్టానానికి, చింతాడ రవికుమార్‌కు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, నాయకుడు దుంపల శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీఐటీయూ జిల్లా కోశాధికారి సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

నరసన్నపేట: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు, కోర్కెలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు పోరాటాలతోనే పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా కోశాధికారి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పలు హామీలు ఇచ్చారని, వాటిని సాధించుకోవాలంటే మీరందరూ సమైక్యంగా పోరాటాలకు సిద్ధపడాలన్నారు. కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, నెలకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 46 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబరు కోడ్లుగా మార్చి, కార్మికుల హక్కులు హరించేందుకు చూస్తోందని దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతోనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చలపతిరావు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మోహన్‌రావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు కె.నరసింహా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

నరసన్నపేట ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని 31 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డి.సరోజిని, ఉపాధ్యక్షులుగా ఎం, పుణ్యవతి, డి.సులోచన, సి.హెచ్.సింహాద్రి, ప్రధాన కార్యదర్శిగా పి.భాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కె.లలిత, ఎస్.సుశీల, కె.అమ్మొడమ్మ, కోశాధికారిగా అమరావతి, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రానైట్ లారీలతో పాడైన రహదారి


కిడిమి, రామచంద్రాపురం జంక్షన్లో కుంగిన రహదారి


కిడిమి సమీపంలో పాడైన రహదారి

సారవకోట: మండల కేంద్రం నుంచి చోడసముద్రం మీదుగా కిడిమికి వెళ్లే దారిలో భారీ గ్రానైట్ రాళ్లను తీసువెళ్తున్న లారీలతో రహదారి పూర్తిగా పాడైంది. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం క్రింద నిధులు మంజూరు చేసి రహదారిని నిర్మించారు. చోడసముద్రం నుంచి కిడిమి వరకు నాలుగు గ్రానైట్ క్వారీలకు చెందిన భారీ లారీలు వెళ్తుండటంతో రోడ్డు కుంగిపోయింది. ఇటీవల కిడిమి గ్రామస్తులు లారీలు అడ్డుకున్నా ఫలితం లేక పోయింది. పంచాయతీ రహదారిలో నిబంధనల కంటే ఎక్కువ బరువుతో లారీలు వెళ్లడం వల్లే ఇలా తయారైందని సింగంవలస, బొంగాడిపేట, కిడిమి తదితర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాతపట్నం: రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు పాతపట్నంకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎన్ని శేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో జిల్లా స్థాయిలో రోలర్ స్కేటింగ్‌లో అండర్-11 విభాగంలో శాన్వీ సీతల్, అండర్-14 విభాగంలో కొర్రాయి సాయివర్షిత, సైలాపు కృష్ణచైతన్య రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను పీడీలు ఎస్.కృష్ణ, జె.కృష్ణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చీపురు పొదలతో ప్రమాదాలు..


పట్టుపురం వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కాలువ మలుపులో ఏపుగా పెరిగిన చీపురు పొదలు

మెళియాపుట్టి: పర్లాకిమిడి నుంచి పలాస వెళ్లే ముఖ్య రహదారికి ఇరువైపులా మలుపుల్లో చీపురు పొదలు ఏపుగా పెరిగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పుట్టుపురం గ్రామం దాటిన తర్వాత ఆఫ్‌షోర్ కాలువ మలుపులో రహదారి కనిపించకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల మాకనాలపల్లి గ్రామానికి చెందిన పోమేశ్వరరావు అనే యువకుడు రాత్రి వేళ ద్విచక్ర వాహనంపై వస్తూ.. అదే ప్రదేశంలో పొదల వలన రహదారి కనిపించక అదుపుతప్పి తుప్పల్లోకి వెళ్లి తీవ్రగాయాల పాలై ప్రాణాలు కోల్పోయాడు. దట్టమైన పొదల్లో మృతదేహం ఉండటం వలన మూడు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో బయటపడింది. పట్టుపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా గురజాడ జయంతి


మెళియాపుట్టి: గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

మెళియాపుట్టి: గురజాడ అప్పారావు గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన రచనలు ఎంతో ఉపయోగకరమని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి ఆర్ అనురాధ అన్నారు. ఆదివారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గురజాడ అడుగు జాడల్లో నడవాలన్నారు. ఉపాధ్యాయులు మురళీమోహన్ పాత్రో, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరు మండల రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి రచయితల సంఘం అధ్యక్షుడు కలమట శ్రీరాములు, రచయితలు నివాళులర్పించారు. రచయితలు మాట్లాడుతూ.. గురజాడ బడుగు, బలహీన వర్గాల ప్రజలు పడుతున్న సమస్యలపై పలు రచనలు, నాటక ప్రదర్శనలు చేశారన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘం సభ్యులు కామేశ్వరి, ఉషారాణి, దిలీప్, బి.రమణమూర్తి పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతి సారవకోటలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవలింగి జేబీటీ పాఠశాలలో గురజాడ జయంతిని నిర్వహించారు. గురుజాడ చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ, సిబ్బంది పూలమాలలు వేశారు.


కొత్తూరు: గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీరాములు, తదితరులు

నేటినుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నారు. మండపాలు, ఆలయాలను విద్యుత్ దీపాలు, రంగు.. రంగుల జెండాలు, పచ్చని తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. - సాక్షి నెట్‌వర్క్


సారవకోట: అవలింగి నీలమణి అమ్మవారి ఉత్సవ విగ్రహం


పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారు


పాతపట్నం: విద్యుత్ కాంతులతో నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం


సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో సిద్ధం చేసిన అమ్మవారి మండపం

జంగిల్ తొలగించాలి..


బొడ్డేపల్లిపేట, కొర్లకోటకు మధ్యలో ముళ్ల పొదలు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణం నుంచి కొర్లకోట, కొత్తవలస, చీమలవలస, నిమ్మతొర్లవాడ తదితర గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రాహదారి బొడ్డేపల్లిపేట జంక్షన్ నుంచి కొత్తవలస వరకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి ఉంది. ఈ రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులకు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా నిధులు లేవని సమాధానం చెబుతున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలకులు, అధికారులు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.